# ట్రాక్టరే కెమిలాయిడ్స్ ఫ్యాక్టరీలో మృత్యు శకటం

- ఇది ప్రమాదమా?- యాజమాన్య హత్యేనా?ముగ్గురి మృతికి బాధ్యులెవరు?
- కెమిలాయిడ్స్ ఫ్యాక్టరీలో 'మరణ మృదంగం', కన్నీరు మున్నీరవుతున్న కార్మిక కుటుంబాలు
- భద్రత లేని ట్రాక్టర్ ట్రాలీలో కూలీల తరలింపుపై నవతరం ఇన్వెస్టిగేటివ్ రిపోర్ట్
- కార్మికులకు కనీస రక్షణ కవచాలు కరువు,కూలీల ప్రాణాలతో చెలగాటమాడుతున్న వైనం
- మామిడి తోటల్లో అక్రమ రసాయన నిల్వలు
- అధికారుల కళ్ళుగప్పి అక్రమ దందా, బాధితులకు న్యాయం చేయడంలో యాజమాన్యం మొండివైఖరి
- యాజమాన్యం పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రజా సంఘాల డిమాండ్








భద్రాద్రి కొత్తగూడెం/ఖమ్మం (నవతరం ప్రతినిధి): అభివృద్ధి ముసుగులో వెలుస్తున్న పరిశ్రమలు సామాన్య కార్మికుల, ప్రజల ప్రాణాలను బలిపీఠం ఎక్కిస్తున్నాయి. లాభాలే పరమావధిగా సాగుతున్న 'కెమిలాయిడ్స్' ఫ్యాక్టరీ యాజమాన్యం తీరు ఇప్పుడు పారిశ్రామిక వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. నిబంధనలను తుంగలో తొక్కి, కనీస భద్రతా ప్రమాణాలు పాటించకుండా కాంట్రాక్ట్ కార్మికులను మృత్యు వాహనాల్లోకి నెట్టడం వల్లే ముగ్గురు ప్రాణాలు గాలిలో కలిసిపోగా, మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఇది కేవలం ప్రమాదం కాదని, యాజమాన్యం యొక్క వ్యవస్థీకృత నేరమని క్షేత్రస్థాయి పరిశీలనలో స్పష్టమవుతోంది.చట్టాన్ని ధిక్కరిస్తూ, కార్మికులను నరకానికి పంపిన పాపం ఎవరిది?



మోటార్ వాహనాల చట్టం ప్రకారం.. సరుకుల రవాణాకు ఉపయోగించే వాహనాల్లో మనుషులను తరలించడం నిషిద్ధం. కానీ, కెమిలాయిడ్స్ యాజమాన్యం తమ స్వార్థం కోసం కాంట్రాక్ట్ కూలీలను సేఫ్టీ లేని ట్రాక్టర్ ట్రాలీలలో ఫ్యాక్టరీ బయట పనుల నిమిత్తం తరలించింది.అసలు ఈ ట్రాలీ ట్రాక్టర్కు ఫిట్నెస్, ఆర్ సి, ఇన్సూరెన్స్ ఉన్నాయా? రవాణా శాఖకు కమర్షియల్ పన్నులు కడుతున్నారా?
రసాయనాలతో పనిచేసే కార్మికులకు ప్రత్యేక రక్షణ వాహనాలు ఉండాలి. కానీ ఇక్కడ ట్రాక్టర్లను వాడటం ద్వారా వారి ప్రాణాలను పణంగా పెట్టారు.
రసాయనాలతో నేరుగా పనిచేసే కూలీలకు కనీస రక్షణ కవచాలు (పి పి ఈ కిట్స్- మాస్కులు, గ్లౌజులు, బూట్లు) అందించకపోవడం 'ఫ్యాక్టరీల చట్టం' యొక్క స్పష్టమైన ఉల్లంఘన. ప్రమాదం జరిగినప్పుడు ఏఒక్క కార్మికుడికి ఎలాంటి రక్షణ కవచాలు యాజమాన్యం ఇవ్వకపోవడం గమనార్హం. ఘటన స్థలాన్ని పరిశీలిస్తే ఈ విషయం తేటతెల్లమవుతుంది.

ఫ్యాక్టరీ యాజమాన్య జవాబుదారీతనం ఏది? ప్రమాదం జరిగిన వెంటనే బాధితులకు మెరుగైన వైద్యం అందించడంలో కంటే, విషయాన్ని కప్పిపుచ్చడానికే యాజమాన్యం ప్రాధాన్యతనిచ్చిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.
"సేఫ్టీ లేని వాహనాల్లో కార్మికులను పంపడం చట్టరీత్యా నేరం అని తెలిసి కూడా ఎందుకు పంపారు? మూడు ముక్కలైన ట్రాక్టర్ ట్రాలీకి అసలు ఫిట్నెస్ సర్టిఫికెట్ జాఉందా?అనేది ప్రశ్న.ఈ మరణాలకు యాజమాన్యమే నైతిక మరియు చట్టపరమైన బాధ్యత వహించాలి కదా?"
గతంలో జరిగిన ప్రమాదాల్లోనూ బాధితులకు న్యాయం జరగలేదని, కేవలం పోలీసు రిపోర్టులతో కాలయాపన చేస్తూ యాజమాన్యం తప్పించుకుంటోందని విమర్శలు వస్తున్నాయి.
క్రిమినల్ కేసులు: భద్రతా ప్రమాణాలు పాటించని, చట్టాలను ఉల్లంఘించిన యాజమాన్యంపై కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేయాలనీ పౌర సమాజం డిమాండ్ చేస్తోంది. మరణించిన కార్మికుల కుటుంబాలకు తక్షణమే భారీ పరిహారం అందించి ఆదుకోవాలి.

నిబంధనలు గాలికి.. తోటల్లోనే 'విష' వలయం!
పరిశ్రమల నుండి వచ్చే ప్రమాదకర రసాయన వ్యర్థాలను కచ్చితంగా కాలుష్య నియంత్రణ మండలి(పొల్యూషన్ కంట్రోల్ బోర్డు) నిర్దేశించిన డంపింగ్ యార్డులకే తరలించాలి. కానీ, కెమిలాయిడ్స్ యాజమాన్యం జంగారెడ్డిగూడెం రోడ్డులోని మామిడి తోటలను, అల్లిగూడెం రోడ్డులోని తోటలను అక్రమ డంపింగ్ యార్డులుగా మార్చేసిందా? జనావాసాల మధ్య, వ్యవసాయ భూముల్లో వ్యర్థాలను నిల్వ చేయడం పర్యావరణ చట్టాల ప్రకారం నేరం కాదా? దీనివల్ల భూగర్భ జలాలు కలుషితమై, స్థానిక రైతులు ఆందోళన చెందుతున్నారు.
అధికారుల కళ్లుగప్పి ఫ్యాక్టరీలో తనిఖీలు జరిగినప్పుడు తోటల్లో నిల్వ చేసిన వ్యర్థాల వివరాలను దాచారా? పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకి తెలిసే చేశారా? దీని వెనుక ఉన్న మర్మమేమిటని కొన్ని ప్రజా సంఘాలు ప్రశ్నిస్తున్నాయి.
తనిఖీలు: కాలుష్య నియంత్రణ మండలి అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టి, మామిడి తోటల్లోని వ్యర్థాలను తొలగించాలి.
ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కెమిలాయిడ్స్ లాంటి పరిశ్రమలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపకపోతే భవిష్యత్తులో మరిన్ని మరణాలు సంభవించే ప్రమాదం ఉంది.బాధితుల పక్షాన నిలబడి, ఈ అక్రమాలపై తన పోరాటాన్ని కొనసాగిస్తూ,, రేపటి సంచికలో మరిన్ని వివరాలతో మీ 'నవతరం'.

